E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 24-05-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:141|| పేజీలు–6
www.ekaburu.com

తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు

యువత ఉపాధి కోసమే.. విదేశాలతో సంబంధాలు

ఈ-కబురు, దిల్లీ: భారత్ పెంపొందించుకున్న అంతర్జాతీయ సంబంధాల ఉద్దేశం.. దేశ యువతకు ప్రయోజనం కలిగించడమేనని, ఉద్దేశపూర్వకంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నామని

2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు.. పాలమూరుకు రూ.587 కోట్లు

రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయాలు
జూన్ 1న నియోజకవర్గానికి 2 వేల చొప్పున రెండో విడత ఇళ్ల మంజూరు
క్యూర్ పరిధిలో పేదలకు లక్ష గృహాలు
వేగంగా పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ
గోదావరి పుష్కరాలకు రూ.వేయి కోట్లు
జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం

ఈకబురు, హైదరాబాద్: తెలంగాణలో పేదల ఇళ్ల నిర్మాణానికి పెద్దపీట వేయాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. పూరిగుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని తీర్మానించింది. జూన్ 1 నుంచి ఇందిరమ్మ పథకం రెండో విడత కింద పేద కుటుంబాలకు 2.5 లక్షల ఇళ్ల మంజూరుకు ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున మంజూరుకు అనుమతించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ 2వ తేదీ నాటికి దాదాపు లక్ష గృహ ప్రవేశాలు జరగాలని నిర్ణయించింది. సచివాలయంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తీర్మానించింది. వివరాలను రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..

మిగతా 2లో

వేద పాఠశాలకు శ్రీకారం

- యాదగిరిగుట్టలో భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రూ.99.55 కోట్ల అభివృద్ధి పనులకూ.. ఆలయంలో సమస్యల పరిష్కారానికి హామీ

ఈకబురు, నల్గొండ, , యాదగిరిగుట్ట, భువనగిరి: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయనగరిలో 15 ఎకరాల విస్తీర్ణంలో 1.4లక్షల చదరపు అడుగుల్లో నిర్మించనున్న వేద గురుకుల పాఠశాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు.

02

భారత్‌తో వాణిజ్య బంధం మరింత బలోపేతం

.... అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో

ఈ-కబురు, : నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రధాని మోదీ తో సమావేశమయ్యారు. వైట్‌హౌస్‌ను సందర్శించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరపున ఆయన మోదీని ఆహ్వానించారు.

ఏ భాషలో ఫిర్యాదు చేసినా చిటికెలో ఎఫ్ఐఆర్

దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత బహుభాషా ఫిర్యాదుల రికార్డర్ యాప్ అందుబాటులోకి
బాధితులు మాతృభాషలో చేసే ఫిర్యాదులు తక్షణమే లిఖితపూర్వకంగా అనువాదం

03

3,589 కి.మీ.తో ద.మ. రైల్వే జోన్

ఆరు నుంచి మూడుకు తగ్గనున్న జోన్లు
ఇకపై సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లకే పరిమితం
జూన్ 1 నుంచి మారనున్న ముఖచిత్రం

02

వైద్య రంగంలో సరికొత్త విప్లవం

సంజీవని

ఇంటివద్దకే ఆధునిక వైద్యం.!

ఇంటి వద్దే 42 వైద్య పరీక్షలు.. సంజీవని స్పెషల్
డిజిటల్ హెల్త్ కార్డులతో కొత్త వైద్య విధానం

ఈ-కబురు,అమరావతి, మే 22:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో ఒక సరికొత్త డిజిటల్ విప్లవానికి తెరలేపింది. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండలం కండ్రిగలో జరిగిన 'సంజీవని' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రామ రావణ యుద్ధ సమయంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు తెచ్చిన సంజీవని మొక్కను గుర్తుచేస్తూ, అదే స్ఫూర్తితో డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ సరికొత్త 'సంజీవని' ప్రోగ్రామ్‌ను డిజైన్ చేసినట్లు సీఎం వెల్లడించారు. ఈ సభలో సీఎం చంద్రబాబు ఆరోగ్యం ప్రాధాన్యత గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. మనిషికి ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే వృథా అని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారే అందరి కన్నా నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. ఏదో బతికి ఉన్నాం కదా అని మంచంపై కాలం వెళ్లదీయడం కాకుండా, ప్రతి ఒక్కరూ హెల్తీగా బతకడమే ముఖ్యమన్నారు. భవిష్యత్తులో మన పిల్లలే మన సంపద అని, ఆరోగ్యవంతమైన ప్రజలు ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. మారుమూల ప్రాంతాల్లో ఉండే పేద ప్రజలకు సైతం అత్యుత్తమ కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ సంజీవని ప్రాజెక్టు మెయిన్ ఎయిమ్ అని స్పష్టం చేశారు.సమాజం బాగుండాలంటే ప్రజలు ఫిట్‌గా ఉండాలని, అందుకోసమే ప్రిడిక్టివ్ (ముందుగా ఊహించడం

మిగతా 3లో

సెంట్రింగ్ కార్మికులతో చర్చించి, రెండు రోజుల్లో

సమస్యలు పరిష్కరించాలి

లేదంటే వాళ్లతో పాటు సమస్య తీరే వరకు నేనే ధర్నాలో కూర్చుంట
గుంపు మేస్త్రీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలు ఆగమవుతున్నాయి
అందుకే గుంపు మేస్త్రీ హఠావో....తెలంగాణ బచావో అంటున్నా
సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లను పట్టించుకోకపోతే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టటం ఖాయం
తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
ఇందిరాపార్క్ వద్ద సెంట్రింగ్ కార్మికుల ధర్నాలో పాల్గొని వారికి మద్దతు తెలిపిన కవిత

మా సామాజిక మాధ్యమ ఖాతాలు, వెబ్‌సైట్‌ను స్తంభింపజేశారు: సీజేపీ

02

పంజాబ్ రేసులోనే..

లఖ్‌నవూపై కీలక విజయం
ఐపీఎల్-19లో ఆరంభంలో ఆరు విజయాలు సాధించి ప్లేఆఫ్స్ చేరే తొలి జట్టు ఇదేనా అనిపించిన పంజాబ్ కింగ్స్ తర్వాత వరుసగా ఆరు మ్యాచ్‌లు ఓడి ఆ అవకాశాలను క్లిష్టం చేసుకుంది. రేసులో ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఆ జట్టు అదరగొట్టింది.

నిర్లక్ష్యపు నిర్ణయం

- గ్రీన్ కార్డుల మెమోను వ్యతిరేకిస్తున్న న్యాయ నిపుణులు
- 12 లక్షల భారతీయ కుటుంబాలపై ప్రభావం! పాటిల్

ఈ-కబురు, వాషింగ్టన్: అమెరికాలో ఉంటున్న తాత్కాలిక వలసదారులు స్వదేశాలకు వెళ్లి గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంపై ఆందోళనతో పాటు నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

మా సామాజిక మాధ్యమ ఖాతాలు, వెబ్‌సైట్‌ను స్తంభింపజేశారు: సీజేపీ

ఈకబురు,దిల్లీ: తమ సామాజిక మాధ్యమ ఖాతాలను, వెబ్‌సైట్‌ను స్తంభింపజేశారని వ్యంగ్య డిజిటల్ సంస్థ 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ఆరోపించారు. ఇన్‌స్టాగ్రాం, ఎక్స్ హ్యాండిళ్లను భారత్‌లో నిలిపివేశారని, బ్యాకప్ ఖాతానూ కొంతసేపు స్తంభింపజేశారని తెలిపారు. ''మా సామాజిక మాధ్యమ ఖాతాలేవీ ఇప్పుడు మా చేతిలో లేవు. ఇకపై వచ్చే ఎలాంటి ప్రకటనల్నీ సీజేపీ అధికారిక ప్రకటనలుగా తీసుకోవద్దు'' అని బ్యాకప్ 'ఎక్స్' హ్యాండిల్ ద్వారా పేర్కొన్నారు. తమ ఉద్యమంపై ఒక పథకం ప్రకారం దాడి జరుగుతోందన్నారు. నీట్‌యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై చర్య తీసుకునే బదులు, దాని కోసం డిమాండ్ చేసిన కాక్రోచ్ జనతాపార్టీపై చర్యలు తీసుకున్నారని విమర్శించారు. ఖాతాలను హ్యాక్ చేసినా ఉద్యమాన్ని మాత్రం చేయలేరని చెప్పారు. నిరంకుశత్వంపై గళమెత్తుతూనే ఉంటామని, ప్రతీ దాడి కాక్రోచ్‌లను బలోపేతం చేస్తుందని స్పష్టంచేశారు. 'కొత్త ఇంటికోసం మేం ప్రయత్నిస్తున్నాం. కాక్రోచ్‌లు ఎప్పటికీ చావవు' అని చెప్పారు.

యువత ఉపాధి కోసమే.. విదేశాలతో సంబంధాలు

ఈకబురు, దిల్లీ: భారత్ పెంపొందించుకున్న అంతర్జాతీయ సంబంధాల ఉద్దేశం.. దేశ యువతకు ప్రయోజనం కలిగించడమేనని, ఉద్దేశపూర్వకంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మోదీ పేర్కొన్నారు. దేశంలోని 47 ప్రాంతాల్లో శనివారం ఏకకాలంలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు ఆన్‌లైన్ పద్ధతిలో అందజేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. వివిధ దేశాలకు చెందిన ప్రపంచస్థాయి కార్పొరేట్లు భారత యువతను కొనియాడుతున్నాయని చెప్పారు. భారత అభివృద్ధి పయనంలో ప్రపంచమే భాగస్వామి కావాలనుకుంటోందని తెలిపారు. ఇటీవల తాను చేపట్టిన ఐదు దేశాల పర్యటనను ప్రస్తావిస్తూ, ప్రపంచస్థాయి సంస్థలు భారత యువత ప్రతిభ పట్ల ఆసక్తి చూపడం ఆనందంగా ఉందన్నారు. ఆయా దేశాలతో ప్రతి ఒప్పందం ఉపాధి అవకాశాల కల్పనతో ప్రత్యక్షంగా ముడిపడి ఉందన్నారు. 2047కల్లా వికసిత భారతాన్ని సాధించాలన్న ఆశయానికి అనుగుణంగా వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి లక్షల ఉద్యోగాలు సృష్టిస్తున్నామని తెలిపారు. వాణిజ్యానికి, వాణిజ్య సంస్థలకు అనుకూలమైన వాతావరణ సృష్టి జరగాల్సిన అవసరాన్ని నూతన ఉద్యోగులంతా దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

51 వేల మందికి నియామక పత్రాలు

''దేశంలో వేలమంది యువజనులకు ఇది సుదినం. ఈరోజు 51 వేల మంది యువ అభ్యర్థులకు ప్రభుత్వోద్యోగాల నియామక పత్రాలు అందజేశాం'' అని ప్రధాని పేర్కొన్నారు. రైల్వేలు, బ్యాంకింగ్, రక్షణ, వైద్య, విద్య తదితర రంగాల్లో నియామకం పొందిన యువజనులందరూ దేశ అభివృద్ధి పయనంలో భాగస్వాములు కానున్నారని చెప్పారు.

2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు.. పాలమూరుకు రూ.587 కోట్లు

మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ల తో కలిసి వెల్లడించారు. ''కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొఠారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1న ప్రారంభిస్తాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులందరం అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం. వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం రాష్ట్రంలో 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని నిర్ణయించాం. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని సూచించింది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు; గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు త్వరలోనే నిధులు కేటాయిస్తాం. సొంత స్థలాలున్న వారికి రూ.ఐదేసి లక్షలు ఇస్తాం.

లైఫ్ సైన్సెస్ విధానానికి ఆమోదం

తెలంగాణను 2030 నాటికి ఐదు ప్రపంచ శ్రేణి లైఫ్ సైన్సెస్ కేంద్రాల్లో ఒకటిగా అభివృద్ధి చేయాలన్నది రాష్ట్రప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 202630ని మంత్రిమండలి ఆమోదించింది. దావోస్‌లో సీఎం ఈ విధానాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ మీద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఆవిష్కరణలపై దృష్టి సారిస్తాం. పరిశోధన, అభివృద్ధి యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ విధానంలో మార్పు తెచ్చాం. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

ఇతర ముఖ్య నిర్ణయాలు..

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్ల కేటాయింపు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు.

వచ్చే ఏడాది జూన్ 26నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1,000 కోట్ల కేటాయింపు. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరు.

రాష్ట్రంలోని డీసీఎంఎస్‌లు మార్క్‌ఫెడ్‌లో విలీనం. రాష్ట్ర సహకార గ్రామీణ నీటిపారుదల సంస్థ హాకాలో విలీనం.

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధరలోని నూతన డిగ్రీ కళాశాలలో 20 శాశ్వత బోధన, 6 బోధనేతర, 3 పోస్టులు పొరుగు సేవల కేటగిరీలో మంజూరు. కేసముద్రం అగ్నిమాపక కేంద్రానికి 18 పోస్టులు మంజూరు.అస్సాం రైఫిల్స్, బీఆర్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లా వెల్దిలో 4, రుక్మాపూర్‌లో 5, గన్నేరువరం మండలంలో 5 ఎకరాల కేటాయింపు.

పంట ఉత్పత్తుల కొనుగోలు...: మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు రాష్ట్ర మంత్రి మండలి శనివారం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటికే 14.89 లక్షల టన్నుల మొక్కజొన్న కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతించింది. ఇంకా నిల్వలున్నందున అదనంగా 6,53,817 టన్నుల కొనుగోళ్లకు రూ.1,677 కోట్ల రుణం అవసరమని, దానికి బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని మార్క్‌ఫెడ్ ప్రతిపాదించగా ఆమోదం లభించింది. 2,76,277 టన్నుల జొన్న కొనుగోళ్లకు రూ.1,154.76 కోట్ల రుణం కోసం, 10,175 టన్నుల పొద్దుతిరుగుడు కొనుగోళ్లకు రూ.86.37 కోట్ల రుణం కోసం ప్రభుత్వ బ్యాంకు గ్యారంటీలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది'' అని మంత్రి పొంగులేటి వివరించారు.

ఆర్డీఎస్ఎస్‌లో చేరేందుకు...

విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్)లో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలను ఆమోదించాం. ఇది కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదు. గత ప్రభుత్వం 2017 జనవరి 2న అప్పట్లో కేంద్ర ప్రభుత్వంతో త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. దీనిని అమలు చేయలేదు. దీనిపై రాష్ట్ర శాసనసభలో సుదీర్ఘంగా చర్చించాం. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దీనిపై వివరంగా మాట్లాడారు. విద్యుత్‌రంగానికి పరిశ్రమలు, గృహాలు, రైతులకు మేలు చేసే ఈ పథకంలో ఇప్పటికే అన్ని రాష్ట్రాలు చేరాయి. దీనిని అమలు చేయాలని నిర్ణయించాం.

వేద పాఠశాలకు శ్రీకారం

ఈకబురు, నల్గొండ, , యాదగిరిగుట్ట, భువనగిరి: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయనగరిలో 15 ఎకరాల విస్తీర్ణంలో 1.4లక్షల చదరపు అడుగుల్లో నిర్మించనున్న వేద గురుకుల పాఠశాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. దీంతోపాటు మొత్తం రూ.99.55 కోట్లతో చేపట్టనున్న ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. తొలుత ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 8.50 గంటలకు ఆలయ నగరి ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్దకు సీఎం చేరుకున్నారు. అక్కడి నుంచి వేద పాఠశాల ప్రాంగణానికి రాగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతిస్వామి వద్దకు వచ్చి ఆయన పాదుకలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రధాన పండితుల మంత్రోచ్చారణల మధ్య వేద పాఠశాల నిర్మాణానికి విజయేంద్ర సరస్వతిస్వామితో కలిసి సీఎం భూమి పూజ చేశారు. ఆలయంలో కల్పించే మౌలిక వసతులకు శిలాఫలకాలు ఆవిష్కరించిన అనంతరం సీఎంతో పాటు మిగిలిన వారికి సైతం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు. అనంతరం అక్కడి నుంచి కాన్వాయ్‌లో దేవస్థానానికి వెళ్లి పంచనారసింహులను దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో 35 నిమిషాలు ఉన్న సీఎం అనంతరం 11.05లకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్లారు.

తితిదే తరహాలో అభివృద్ధి

యాదగిరిగుట్ట ఆలయనగరిని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పంలో భాగంగా ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని అత్యంత భక్తిశ్రద్ధలతో పనులు నిర్వహించేలా పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి జిల్లా యంత్రాంగానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. ఆలయంలోని పలు అపరిష్కృత సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు అర్చకులు, అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఏమేం పనులు చేయనున్నారంటే..

రూ.43.79 కోట్ల అంచనా వ్యయంతో మూడు దశల్లో వేద పాఠశాలను నిర్మించనున్నారు. సంప్రదాయ ఆశ్రమ గురుకుల పద్ధతిలో 500 మంది విద్యార్థులకు వసతితో కూడిన విద్య అందించనున్నారు. సముదాయంలో హోమాలు, యాగశాలలే కాకుండా గోశాల కూడా ఏర్పాటు చేయనున్నారు. రూ.9.86 కోట్లతో కొండపైన నిత్యకల్యాణ రంగ మండపం, వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ.1.41 కోట్లతో పై కప్పు నిర్మాణం, రూ.1.34 కోట్ల అంచనాతో మాడవీధులకు కొత్త మెట్ల నిర్మాణ పనులు, రూ.43.15 కోట్లతో డార్మిటరీ హాళ్లు, దీక్షా పరుల సదనం నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

శాఖల మధ్య సమన్వయ లోపం

సీఎం పర్యటన షెడ్యూల్‌లో మార్పులు, శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా అధికారులు స్వాగతం పలకలేకపోయారు. రేవంత్‌రెడ్డి ముందుగా ఆలయానికి చేరుకుంటారని భావించి కలెక్టర్, ఎస్పీలతో పాటు ముఖ్య ప్రజాప్రతినిధులందరూ గుట్ట కింద హెలిప్యాడ్ వద్ద వేచి చూశారు. అనివార్య కారణాలతో సీఎం పర్యటన ఆలస్యమైందని నిఘా వర్గాలు యాదాద్రికి సమీపంలోకి రాగానే అధికారులకు తెలిపారు. వేద పాఠశాల భూమిపూజ ముహూర్త సమయం దాటిపోతుందని భావించిన సీఎం నేరుగా పెద్దగుట్టపైనున్న హెలిప్యాడ్ వద్ద దిగారు. అక్కడే ఏర్పాటు చేసిన కారవాన్‌లోనే పట్టువస్త్రాలు మార్చుకున్నారు. కొండ కింద వేచిచూస్తున్న అధికారులు వచ్చే లోపే సీఎం.. మంత్రులు, ఇతర స్థానిక నాయకులతో కలిసి నడుచుకుంటూ వేదపాఠశాల భూమిపూజ కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఉన్నతాధికారుల ఆగ్రహం

ప్రొటోకాల్ ఉల్లంఘన, అధికారుల నిర్లక్ష్యంపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశంతో కలెక్టర్ అనురాగ్ జయంతి.. ఆర్‌అండ్‌బీ ఈఈకి షోకాజ్ నోటీసు జారీ చేయడంతోపాటు, నివేదికను సమర్పించినట్లు అధికారిక వర్గాల సమాచారం. నిర్దేశిత ప్రదేశంలో కాకుండా మరోచోట హెలికాప్టర్ ల్యాండింగ్, ఆ తదుపరి కొంత సేపు సీఎం హెలికాప్టర్‌లోనే నిరీక్షించాల్సి రావడంపై సచివాలయ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా సిబ్బంది కొండపైకి భక్తులను రెండు గంటల పాటు అనుమతించకపోవడంతో కిందే ఎండలోనే వేచి చూశారు.

3,589 కి.మీ.తో ద.మ. రైల్వే జోన్

ఈకబురు, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేజోన్‌లో జూన్ 1 నుంచి భారీగా పరిపాలన మార్పులు అమల్లోకి రానున్నాయి. సికింద్రాబాద్‌లోని రైలు నిలయం కేంద్రంగా ఇప్పుడున్న 6 డివిజన్లతో కార్యకలాపాలు మే 31 వరకే కొనసాగనున్నాయి. ఇక ద.మ. రైల్వేజోన్‌లో డివిజన్ల సంఖ్య 3 (సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్)కి తగ్గనుంది. దీంతో పరిపాలనా భారం కొంత తగ్గనున్నప్పటికీ.. సికింద్రాబాద్ డివిజన్ పరిధి గణనీయంగా పెరగనుంది. జోన్ పరిధి 6,637 ట్రాక్ కి.మీ. నుంచి 3,589 ట్రాక్ కి.మీ.కి పరిమితం కానుంది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ అమల్లోకి వస్తుండటంతో విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు కొత్త రైల్వేజోన్ పరిధిలోకి వెళతాయి. గుంటూరు డివిజన్‌లో ఉన్న పగిడిపల్లివిష్ణుపురంజాన్‌పహాడ్.. అలాగే గుంతకల్ డివిజన్ పరిధిలోని రాయచూరువాడి సెక్షన్ సికింద్రాబాద్ డివిజన్‌లో విలీనం కానున్నాయి.

సాఫీగా పునర్విభజన..

ద.మ. రైల్వేజోన్ పునర్విభజన, కొత్త దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు సాఫీగా సాగేందుకు రైల్వేబోర్డు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా ఇటీవల రెండు జోన్ల ఉన్నతాధికారులతో రైల్వేబోర్డు ఛైర్మన్ ఆన్‌లైన్ సమావేశం నిర్వహించి జూన్ 1 నుంచి విడివిడిగా కార్యకలాపాల సన్నద్ధతపై సమీక్షించారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధి 204 కి.మీ. మేర పెరగనుంది. దీంతో రైళ్ల రాకపోకలు, సిగ్నలింగ్ సమన్వయం వంటి అంశాల్లో ఒత్తిడి పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. రైళ్ల రాకపోకల నిర్వహణలో డివిజన్ కంట్రోల్‌రూం అత్యంత కీలకపాత్ర పోషిస్తుంది. ఏ రైలుకు ముందుగా క్లియరెన్స్ ఇవ్వాలి.. వంటి అంశాలపై స్టేషన్ మాస్టర్లకు సూచనలు డివిజన్ కంట్రోల్‌రూంలోని కంట్రోలర్లు ఇస్తారు.

కొత్త జోన్‌కు ఉద్యోగుల కేటాయింపు

దక్షిణ కోస్తా జోన్ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసేందుకు రైల్వే బోర్డు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే జనరల్ మేనేజర్, ప్రిన్సిపల్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ పోస్టుల్లో అధికారులను నియమించగా వారు విధుల్లో చేరారు. దక్షిణ కోస్తా జోన్‌కు 128 గెజిటెడ్, 1,100 నాన్‌గెజిటెడ్ అధికారుల పోస్టులను రైల్వేబోర్డు మంజూరు చేసింది. ద.మ.రైల్వే జోన్ నుంచి కొత్త జోన్‌కు పోస్టులు భారీగా బదిలీ అయ్యాయి. 35 గెజిటెడ్, 980 నాన్‌గెజిటెడ్ పోస్టులను రైల్వేబోర్డు బదలాయించింది. మిగతా పోస్టులు ఇతర జోన్ల నుంచి బదిలీ చేసే ప్రక్రియ చేపట్టింది. కాగా దక్షిణ కోస్తా జోన్‌లో 30 మంది గెజిటెడ్, 300 పైచిలుకు నాన్‌గెజిటెడ్ అధికారులు విధుల్లో చేరినట్లు రైల్వేవర్గాల సమాచారం.

నిర్లక్ష్యపు నిర్ణయం

ఈకబురు, వాషింగ్టన్: అమెరికాలో ఉంటున్న తాత్కాలిక వలసదారులు స్వదేశాలకు వెళ్లి గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంపై ఆందోళనతో పాటు నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. చట్ట నిబంధనలను పాటిస్తూ చేసుకున్న దరఖాస్తులపై నిర్ణయాన్ని పూర్తిగా అధికారుల విచక్షణకు వదిలేయడమేంటని చట్టసభ సభ్యులతోపాటు న్యాయ నిపుణులు మండిపడుతున్నారు. ఇది నిర్లక్ష్యపూరిత, తప్పుడు నిర్ణయమని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు ఇది చట్టపరంగా చెల్లుబాటు అవుతుందా అనే ప్రశ్నతో పాటు... భారత్‌తో వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకున్న నేపథ్యంలో దౌత్యపరమైన ఒత్తిడి పెంచటంలో భాగంగా ట్రంప్ సర్కారు తీసుకున్న ఎత్తుగడా అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. తాజా నిబంధన.. అమెరికాలోని 12 లక్షల భారతీయ కుటుంబాలపై ప్రభావం చూపే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయంపై జారీ చేసిన మెమోను వెనక్కి తీసుకునే వరకూ ప్రతి వేదిక మీదా పోరాడతామని డెమోక్రటిక్ పార్టీ చట్టసభ సభ్యులు తేల్చి చెప్పారు. ఈ చర్య ఎంతో కాలంగా అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ గ్రీన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న వారికి ఆశనిపాతమని బైడెన్ హయాంలో శ్వేత సౌధం సలహాదారుగా పని చేసిన అజయ్ భూటోరియా పేర్కొన్నారు. అమెరికాలోని ప్రతి చట్టాన్నీ గౌరవిస్తూ చట్టబద్ధ నివాసం కోసం ఎదురు చూస్తున్న వారిని ఇబ్బందుల్లోకి నెట్టడమేనని అభిప్రాయపడ్డారు. ఐ485కు దరఖాస్తు చేసుకున్నవారు అన్ని నిబంధనలను పాటించినా వాటిని పరిశీలించకుండానే తిరస్కరించే విచక్షణాధికారం అమెరికా అధికారులకు లభిస్తుందని, ఇక నుంచీ చట్టబద్ధ అర్హతలు ఎంత మాత్రం సరిపోవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదో లాజిక్ లేని నిర్ణయమని, దీనివల్ల నిపుణులు ఇతర దేశాలకు వలస వెళ్తారని క్యాటో ఇన్‌స్టిట్యూట్ వలస విభాగం డైరెక్టర్ డేవిడ్ జె.బైర్ స్పష్టం చేశారు.అమెరికాలో వేల మంది గ్రీన్ కార్డు దరఖాస్తుదారులు ఉన్నారని, వారిలో నర్సులు, టీచర్లు, ఇంజినీర్లు, మెకానిక్‌లు, వ్యవసాయ కార్మికులు ఉన్నారని, వారందరినీ దేశం నుంచి పంపించేయాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోందని టెక్సాస్ కాంగ్రెస్‌మన్ జోక్విన్ క్యాస్ట్రో అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం భార్యాభర్తలను, తల్లిదండ్రులను, పిల్లలను విడదీస్తుందని తెలిపారు.

కోర్టులో సవాలు చేయవచ్చు..: ప్రభుత్వం జారీ చేసిన మెమోను కోర్టులో సవాలు చేయడానికి అవకాశముంది. దీని అమలుపై ఎటువంటి మార్గదర్శకాలు లేవు.

ఎవరికెలా?: అమెరికా ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మెమో ద్వారా గ్రీన్ కార్డుల విషయంలో ఏ వీసాదారులపై ఎలాంటి ప్రభావం పడుతుందన్నది చర్చనీయాంశంగా మారింది. కొన్ని సడలింపులు ఉన్నాయని ప్రభుత్వం చెప్పినా అది ఎవరెవరికి అనేది స్పష్టత లేదు.

హెచ్ 1బీ, ఎల్ 1 వీసాదారులకు.. : వలసేతర కేటగిరీలో ద్వంద్వ ఉద్దేశంతో చట్టబద్ధ స్టేటస్‌ను కొనసాగించినప్పటికీ అదొక్కటే గ్రీన్ కార్డు దరఖాస్తుకు సరిపోదు. ఈ ఒక్క కారణంతో విచక్షణను ఉపయోగించి అనుకూల నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదు. అంటే సుదీర్ఘకాలంగా అమెరికాలో ఉంటున్నామన్న కారణంతో 'అడ్జస్ట్‌మెంట్ ఆఫ్ స్టేటస్'కు దరఖాస్తు చేసుకోలేరు. అది ఆటోమేటిక్‌గా, పరిపాలనాపరమైన సాధారణ ప్రక్రియ ఇక ఎంత మాత్రం కాదు.

ఇక నుంచీ అడ్జస్ట్ స్టేటస్ దరఖాస్తుకు ఉన్న అర్హతలను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. పన్నుల చరిత్ర, కుటుంబ పరిస్థితులు, కెరీర్ పురోగతి, ఇతర సాక్ష్యాలను వారు చూడాలి.

ఎఫ్1: ఎఫ్1 అనేది ద్వంద్వ ఉద్దేశ వీసా కాదు. ఒకవేళ విద్యార్థి అక్కడే పీహెచ్‌డీ పూర్తి చేసి స్టెమ్ ఓపీటీలో ఉండి 'స్టేటస్'కు దరఖాస్తు చేసుకుని, అది జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉందని నిరూపించుకుంటే ఆ విద్యార్థి గ్రీన్ కార్డుకు గట్టి దరఖాస్తుదారు అవుతారు.ఈబీ2, ఈబీ3: ఈబీ2, ఈబీ3 బ్యాక్‌లాగ్‌లో ఉన్న ఉద్యోగులు..దశాబ్దకాలంగా వెయిటింగ్‌లో ఉండి ఉంటే.. ఆ ఉద్యోగి అమెరికాలో ఉండి దరఖాస్తు చేసుకుంటే బలమైన ఆధారాలను చూపాల్సి ఉంటుంది. అమెరికాతో సానుకూల సంబంధాలున్నాయని, సుదీర్ఘ ఉద్యోగ అనుభవముందని, పిల్లలు అక్కడే పెరిగారని నిరూపించాల్సి ఉంటుంది.

నల్లపోచమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తా : రాగం హరి శంకర్ యాదవ్

నల్ల పోచమ్మ అమ్మవారికి హరిశంకర్ యాదవ్ ప్రత్యేక పూజలు

ఈకబురు,శేరిలింగంపల్లి : గోపనపల్లి ఎన్టీఆర్ నగర్ లోని శ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని బీఆర్ఎస్ పార్టీ నల్లగండ్ల డివిజన్ సీనియర్ నాయకులు రాగం హరిశంకర్ యాదవ్ అన్నారు. నల్లగండ్ల డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో ఉన్న శ్రీ నల్లపోచమ్మ తల్లి దేవాలయ అభివృద్ధి కోసం ఆలయ కమిటీ సభ్యులు శనివారం రాగం హరి శంకర్ యాదవ్ ను కలిసి తమ సమస్యలు, దేవాలయ అభివృద్ధి, అవసరాలను వివరించారు. దీనిపై స్పందించిన రాగం హరి శంకర్ యాదవ్ శనివారం ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా హరిశంకర్ యాదవ్ మాట్లాడుతూ,ఆలయ అభివృద్ధికి అవసరమైన పనుల విషయంలో తన వంతు సహకారం అందిస్తానని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తానని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం స్థానిక ప్రజలతో కలిసి ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకట్ రెడ్డి, నారాయణ, శేఖర్, నర్సింహ రాజు, విజయ్, గోపాల్ కృష్ణ, సూరిబాబు, కాలియా నాయక్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ప్రత్యేక పూజల్లో హరిశంకర్ యాదవ్ తదితరులు

అంజయ్య నగర్ ఫుడ్ పాయిజన్ పై స్పందించిన అధికారులు

హోటల్ ను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ, జిహెచ్ఎంసి అధికారులు

హోటల్ ను మూసివేసిన దృశ్యం

- నాణ్యత పాటించని హోటల్ సీజ్
- అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి : ఆంజనేయులు సాగర్

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి పరిధిలోని అంజయ్య నగర్ కాలనీలో చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ పై అధికారులు స్పందించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా యువకులు అస్వస్థతకు గురికావడంతో అంజయ్య నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఆంజనేయులు సాగర్ ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కొనసాగుతున్న హోటల్ ను శనివారం తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ, జిహెచ్ఎంసి అధికారులు హోటల్ ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ అంజయ్య నగర్ పరిధిలోని అన్ని హోటల్స్ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, కస్టమర్లకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే అధికారులు సైతం తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజయ్య నగర్ డివిజన్ బీజేపీ నాయకులు ఆంజనేయులు సాగర్ , కాలనీ ప్రెసిడెంట్ నరసింహ సాగర్, రవి నాయక్, తిరుపతయ్య సాగర్, చందు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ కార్మికులతో చర్చించి, రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి

ఈకబురు,హైదరాబాద్:
ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు దిగిన సెంట్రింగ్ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లేదంటే వారితో పాటు సమస్య పరిష్కారమయ్యే వరకు ఎన్ని రోజులైనా తాను ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. 12 డిమాండ్లతో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టిన సెంట్రింగ్ కార్మికులకు కవిత మద్దతు తెలిపారు. ధర్నా శిబిరం వద్దకు వెళ్లి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికుల సమస్యలను ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని వారిని విస్మరిస్తే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు కర్రుకాల్చి వాత పెట్టటం ఖాయమన్నారు. తాము అధికారంలో వచ్చాక సెంట్రింగ్ కార్మికుల అన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గుంపు మేస్త్రీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలు ఆగమావుతున్నాయని చెప్పారు. అందుకే గుంపు మేస్త్రీ హతావో...తెలంగాణ బచావో అనే నినాదమిస్తున్నానని చెప్పారు.

రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలి

హైదరాబాద్ నిర్మాణంలో సెంట్రింగ్ కార్మికుల పాత్ర మరవలేదని కవిత అన్నారు. అందుకే వారి అడుగులో అడుగునై వారికి అండగా నిలుస్తానని చెప్పారు. బిల్డింగ్ నిర్మించే కాంట్రాక్ట్ లో సెంట్రింగ్ వాళ్ల పేరుతో అగ్రిమెంట్లు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ కార్డ్, స్క్వేర్ ఫీట్ కు 51 రూపాయల కూలీ, కార్మికుల చనిపోతే పరిహారం పది లక్షల నుంచి 20 లక్షలు ఇవ్వాలని వారు కోరుతున్నారని చెప్పారు. మొత్తం 12 డిమాండ్లతో సెంట్రింగ్ కార్మికులు చేపట్టిన ధర్నా సహేతుకమైనదేనని అన్నారు. వారు గొంతెమ్మ కోరికలు కోరటం లేదని...ప్రభుత్వం దృష్టి పెడితే సమస్యలు తీర్చవచ్చని చెప్పారు. వారితో చర్చించి రెండు రోజుల్లో సమస్య తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో అద్దాల మేడలు కనిపిస్తున్నాయంటే దాని వెనుక సెంట్రింగ్ కార్మికుల కృషి ఉందని, ప్రాణాలను పణంగా పెట్టి గాలిలో వేలాడుతూ వాళ్లు పనిచేస్తుంటారని చెప్పారు. కానీ వారిని ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవటం అన్యాయమన్నారు. 2 లక్షల రూపాయల పనికోసం 15 లక్షల రూపాయల మెటీరియల్ ను తీసుకెళ్లాల్సి ఉంటుందని వాటికి రక్షణ లేని పరిస్థితి ఉందన్నారు. గుంపు మేస్త్రీ సీఎం అయ్యాక హైడ్రా పేరుతో నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లను కూల్చేస్తున్నారని చెప్పారు. దాని కారణంగా కూడా సెంట్రింగ్ వాళ్లే నష్టపోతున్నారని వారికి ఇంటి యాజమాని గానీ ప్రభుత్వం గానీ పరిహారం ఇవ్వటం లేదని గుర్తు చేశారు. పది రోజులుగా ధర్నా చేస్తూ కూడా మీతో పాటు ఉండే కార్మికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్న మీ మానవత్వానికి చేతులెత్తి నమస్కరిస్తున్నానని సెంట్రింగ్ యాజమాన్యాలను ఉద్దేశించి అభినందించారు.

మేం వచ్చాక అన్ని డిమాండ్లు పరిష్కరిస్తాం

తెలంగాణ రక్షణ సేన అధికాంలోకి వచ్చాక సెంట్రింగ్ కార్మికులు, యాజమాన్యాలు అడిగిన అన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మీరు అడుగుతున్న వాటిలో ఒక్కటి కూడా గొంతెమ్మ కోరిక లేదని చెప్పారు. హైదరాబాద్ లో 86 చోట్ల వెయ్యి నుంచి రెండు వేల గజాల స్థలం ఇస్తామని అన్నారు. ప్రతి మండలంలో కూడా సెంట్రింగ్ కార్మికుల సంఘాలు ఏర్పాటు కావాల్సిన అవసరముందని చెప్పారు. ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోకపోతే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు.

వైద్య రంగంలో సరికొత్త విప్లవం 'సంజీవని'

ఏదో బతికి ఉన్నాం కదా అని మంచంపై కాలం వెళ్లదీయడం కాకుండా, ప్రతి ఒక్కరూ హెల్తీగా బతకడమే ముఖ్యమన్నారు. భవిష్యత్తులో మన పిల్లలే మన సంపద అని, ఆరోగ్యవంతమైన ప్రజలు ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. మారుమూల ప్రాంతాల్లో ఉండే పేద ప్రజలకు సైతం అత్యుత్తమ కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ సంజీవని ప్రాజెక్టు మెయిన్ ఎయిమ్ అని స్పష్టం చేశారు.సమాజం బాగుండాలంటే ప్రజలు ఫిట్‌గా ఉండాలని, అందుకోసమే ప్రిడిక్టివ్ (ముందుగా ఊహించడం), ప్రివెంటివ్ (నివారించడం), క్యూరేటివ్ (నయం చేయడం) అనే మూడు అంచెల విధానంలో సంజీవని ప్రాజెక్టును ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. వ్యాధులు వచ్చాక బాధపడటం కంటే, అవి రాకముందే గుర్తించి అలర్ట్ చేయడమే నిజమైన డెవలప్‌మెంట్ అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ల్యాబ్‌లకు వెళ్లే అవసరం లేకుండా ఏకంగా 42 రకాల వైద్య పరీక్షలను నేరుగా ఇంటి వద్దే నిర్వహించి నిమిషాల్లో రిపోర్టులు ఇచ్చేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. డాక్టర్ అప్పాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా టాప్ డాక్టర్స్ వైద్య సలహాలు, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డుల మానిటరింగ్ వంటి అడ్వాన్స్‌డ్ ఫీచర్స్ ఇందులో ఉన్నాయి.ఈ సంజీవని ప్రాజెక్టు అనేది కేవలం ఒక సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదని, ఇదొక అత్యుత్తమ 'డిజిటల్ పబ్లిక్ హెల్త్ ఆపరేటివ్ సిస్టమ్' అని చంద్రబాబు అభివర్ణించారు. ప్రజలను అనారోగ్యం నుంచి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చే 'సిటిజన్ వెల్‌నెస్ మిషన్' ఇదన్నారు. టెక్నాలజీని వాడుకోవడంలో ఎప్పుడూ ముందే ఉండే చంద్రబాబు సర్కార్.. త్వరలోనే ఈ ప్రాజెక్టులో భాగంగా 'ఏఐ డాక్టర్' (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా కూడా ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించబోతున్నట్లు క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు.గత ఏడాది జూలైలో కుప్పం నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టును పైలట్‌గా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా రోల్ అవుట్ చేశారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా ప్రజారోగ్య వ్యవస్థను సిద్ధం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్‌తో రాబోయే ఆగస్టు 15 (స్వాతంత్ర్య దినోత్సవం) నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును ఫుల్ స్కేల్‌లో లాంచ్ చేయాలని నిర్ణయించినట్లు సీఎం చంద్రబాబు అనౌన్స్ చేశారు.రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులపై కూడా సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పందించారు. ఈ సంవత్సరం వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ రిపోర్ట్స్ చెప్తున్నాయని, అయితే ఎలాంటి పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం పూర్తి సన్నద్ధతతో ఉందని ప్రజలకు భరోసా ఇచ్చారు.

24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల

సేవా తీర్థ్ (పీఎంవో)లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికాభారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు.ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుంటున్నానంటూ చమత్కరించారు.

--ప్రపంచ శ్రేయస్సు కోసం కలిసి పనిచేస్తాం: ప్రధాని మోదీ

అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు

.. కొత్తగూడెంలో అత్యధికంగా 46.3 డిగ్రీలు

ఈకబురు, హైదరాబాద్ :
తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. తెలంగాణలో 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటాయి. కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా 46.3 డిగ్రీలు నమోదైంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో.. కృష్ణా జిల్లా కానుమోలులో అత్యధికంగా 45.8 డిగ్రీలు నమోదైంది. 13 జిల్లాలోని 95 మండలాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటాయి. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో శనివారం 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.

ఏ భాషలో ఫిర్యాదు చేసినా చిటికెలో ఎఫ్ఐఆర్

ఈకబురు, హైదరాబాద్: భాగ్యనగరంలోని పోలీసు స్టేషన్లను ఆశ్రయించే బాధితులకు ఫిర్యాదుల నమోదులో తలెత్తే భాషా సమస్యలను దూరం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ పోలీసులు ఏఐ ఆధారిత బహుభాషా ఫిర్యాదుల రికార్డర్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏఐ-కాప్‌రైటర్ పేరుతో ఉన్న ఈ యాప్‌ను హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ శనివారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఆవిష్కరించారు.

తక్షణమే రికార్డు చేసి అనువదిస్తూ...

బాధితులు మాతృభాషలో చెప్పే ఫిర్యాదుల్లోని అంశాలను ఏఐ-కాప్‌రైటర్ తక్షణమే రికార్డు చేసి లిఖితపూర్వకంగా అనువదిస్తుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులు, పర్యాటకులకు ఫిర్యాదు చేసే సమయంలో ఎదురయ్యే భాషా సమస్యలను ఈ యాప్ తొలగిస్తుంది. బాధితుల భాష అర్థం కాకపోవడం వల్ల ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం జరగడం, సమాచారం తప్పుగా నమోదు కావడానికి ఈ యాప్ స్వస్తి పలకనుంది. తొలిదశలో 10కిపైగా ప్రధాన భారతీయ భాషలను గుర్తించేలా ఈ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సంస్థతోపాటు ప్రాగ్రో చందు అనే ఇంటర్న్ సహకారంతో హైదరాబాద్ సిటీ పోలీసులు రూపొందించారు.

యాప్‌లోని ప్రధాన అంశాలు

బహుభాషా సౌలభ్యం: హిందీ, తమిళం, బెంగాలీ, మరాఠీ వంటి 10 భాషల్లో ఫిర్యాదు చేస్తే ఈ యాప్ వెంటనే పోలీసులకు అర్థమయ్యే భాషలోకి లిఖితపూర్వకంగా అనువదిస్తుంది.

వేగం-కచ్చితత్వం: గంటల తరబడి పట్టే ఫిర్యాదు నమోదు ప్రక్రియను కేవలం సెకన్లలోనే పూర్తి చేయవచ్చు. అనువాదకుల కోసం వేచి చూడాల్సిన అవసరం కూడా ఉండదు.

పారదర్శకత: ఫిర్యాదు రికార్డ్ చేసిన అధికారి వివరాలు, సమయం వంటివి ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో నిక్షిప్తమవుతాయి. దీనివల్ల రికార్డులను తారుమారు చేసే అవకాశం ఉండదు.

మల్టీ-పార్టీ లేబులింగ్: బాధితుడు, నిందితుడు లేదా సాక్షులు మాట్లాడే మాటలను వేర్వేరుగా గుర్తించి రికార్డ్ చేస్తుంది.

శిక్షలు కూడా పెరుగుతాయి

హైదరాబాద్ గ్లోబల్ సిటీ కావడంతో తెలుగు, ఆంగ్లం, హిందీ రాని వాళ్లూ కూడా వలస వచ్చి స్థిరపడుతున్నారు. భాష తెలియకపోవడం వల్ల వచ్చే సమస్యలకు ఈ యాప్ చెక్ పెడుతుంది. ఈ సాంకేతికత వల్ల ముఖ్యంగా వలస కార్మికులు, మహిళలు, వృద్ధులకు పోలీసు సేవలపై భరోసా పెరుగుతుంది. బాధితులు చెప్పే ప్రతి మాటను యథాతథంగా నమోదు చేయడం వల్ల దర్యాప్తులో నాణ్యత పెరిగి తద్వారా నిందితులకు శిక్ష పడే అవకాశాలు మెరుగుపడతాయి. దీనివల్ల పోలీసు అధికారులకు టైపింగ్ భారం తగ్గడమే కాకుండా రికార్డుల నిర్వహణ పద్ధతి ఏకరీతిగా ఉంటుంది. పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ దేశంలోనే తొలిసారిగా ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం గర్వకారణం.

- వీసీ సజ్జనర్, హైదరాబాద్ పోలీసు కమిషనర్

రూపాయి క్షీణత.. ప్రభుత్వ జోక్యం ఉండదు;గోయల్

ఎక్స్ఛేంజీ రేట్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉండదని వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ (Piyush Goyal) పేర్కొన్నారు. రూపాయి విలువ అనేక అంతర్జాతీయ అంశాలు, మార్కెట్‌లపై ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన 19వ రోజ్‌గార్ మేళాలో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వం ఎప్పుడూ ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అయితే, రెండు, మూడు రోజులుగా చూస్తే.. రూపాయి బలపడుతుండటాన్ని గమనించవచ్చన్నారు.డాలరుతో పోలిస్తే రూపాయి విలువ ఇటీవల కనిష్ఠ స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. అయితే, మార్కెట్ సూచీలు పుంజుకోవడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలతో రెండు రోజులుగా రూపాయి కొంత బలపడుతోంది. అమెరికాఇరాన్ శాంతి చర్చల పురోగతిపై ఆశలు పనిచేసినట్లు మార్కెట్ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఇంధన సరఫరాలో అంతరాయం లేదు: ఐఓసీ

దేశవ్యాప్తంగా ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (Indianoil) స్పష్టం చేసింది. కొన్ని ప్రాంతాల్లోని బంకుల్లో పెట్రోల్, డీజిల్‌కు అధిక డిమాండ్ కారణంగా స్థానికంగా ఆయా బంకుల్లో ఇంధన సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, ఇది తాత్కలికమేనని ఐఓసీ తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.''ప్రస్తుతం పంట కోతల సమయం కావడంతో డీజిల్‌కు అధిక డిమాండ్ ఏర్పడింది. అదే సమయంలో ప్రైవేట్ బంకుల్లో ఇంధనం అధిక ధర పలుకుతుండటంతో వినియోగదారులు ప్రభుత్వ బంకులకు తరలివెళ్తున్నారు. అంతర్జాతీయ చమురు ధరల కారణంగా బల్‌క్‌లో పెట్రోల్, డీజిల్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 42,000 ఇంధన స్టేషన్‌లలో కొన్ని బంకుల్లో మాత్రమే ఈ సమస్య వచ్చింది. ఇది తాత్కలికమే. ఇంధనానికి అధిక డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిరంతరం తగిన చర్యలను తీసుకొంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. వినియోగదారులు ఎలాంటి ఆందోళనలకు గురికావొద్దు'' అని ఐఓసీ ఓ ప్రకటనలో పేర్కొంది.

హోండా సిటీ కొత్త వేరియంట్ ధర రూ.12- 21 లక్షలు

హోండా కార్స్ ఇండియా తమ సెడాన్ 'సిటీ' మోడల్‌లో నవీకరించిన వెర్షన్‌ను శుక్రవారం విడుదల చేసింది. సిటీ ఫేస్‌లిఫ్ట్ 2026 ప్రారంభ ధర రూ.12 లక్షలు కాగా, టాప్ ఎండ్ వెర్షన్ ధర రూ.21 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా నిర్ణయించారు. మధ్య స్థాయి సెడాన్ విభాగంలో హ్యుండాయ్ వెర్నా, స్కోడా స్లావియా, ఫోక్స్‌వ్యాగన్ వర్చూస్‌లతో ఈ కారు పోటీపడనుంది. పెద్ద ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, ప్రీమియం లైటింగ్, క్యాబిన్ థీమ్, కొలిజన్ మిటిగేషన్ బ్రేకింగ్ వ్యవస్థ, ఆటోమేటిక్ హెడ్‌లైట్లు, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, లేన్ వాచ్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. వీటితో పాటు 360 డిగ్రీ కెమేరా సెటప్, రెయిన్ సెన్సింగ్ వైపర్లు, 6 ఎయిర్‌బ్యాగ్‌లను అందించారు. బ్లాక్ పెయింట్ ఆప్షన్‌తో కలిపి మొత్తం 6 రంగుల్లో (ఎరుపు, తెలుపు, బ్లూ, సిల్వర్, గ్రే) ఈ కారు లభిస్తుంది. 1.5 లీటర్ ఐ-వీటెక్ పెట్రోల్ వేరియంట్ లీటరుకు 17.97 కి.మీ, హైబ్రిడ్ వెర్షన్ లీటరుకు 27.26 కి.మీ మైలేజీ ఇస్తాయని కంపెనీ తెలిపింది. 2030 నాటికి 10 కొత్త మోడళ్లు: 2030 నాటికి భారత విపణిలోకి 10 కొత్త మోడళ్లు తీసుకొచ్చేందుకు జపాన్ వాహన దిగ్గజం హోండా సన్నాహాలు చేస్తోంది. ఇందులో విద్యుత్ కారు, కాంపాక్ట్ ఎస్‌యూవీ ఉంటాయని కంపెనీ అధ్యక్షుడు, సీఈఓ తకాషి నకజిమా తెలిపారు. భారత్‌లో హోండా ప్రీమియం ఎస్‌యూవీ జడ్ఆర్-వీను శుక్రవారం ప్రదర్శించిన సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో హోండా మొదటి పూర్తి స్థాయి విద్యుత్ కారును భారత విపణిలో విడుదల చేయనుందని తకాషి పేర్కొన్నారు. సిటీ హైబ్రిడ్, జడ్ఆర్-వీ హైబ్రిడ్‌తో కలిపి ప్రస్తుత ఆర్థికంలో 6 కొత్త మోడళ్లు విడుదల చేస్తామన్నారు.

పెట్టుబడుల ఉపసంహరణకు సిప్ సహకారం

విదేశీ మదుపర్లు సులభంగా అమ్మేసుకున్నారు

రెండేళ్లలో రూ.7.49 లక్షల కోట్లు తరలిపోయాయ్

అత్యల్ప మూలధన పెట్టుబడుల వల్లే రూపాయి పతనం: జెఫ్రీస్

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకపు విలువ ఇటీవల భారీగా పతనం కావడానికి, క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో వస్తున్న భారీ దేశీయ పెట్టుబడులూ పరోక్షంగా దోహద పడ్డాయని అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ జెఫ్రీస్ తాజా నివేదికలో వెల్లడించింది. ఖరీదైన మార్కెట్ నుంచి లాభాలను నగదుగా మార్చుకుని బయటపడాలనుకునే విదేశీ మదుపరులకు, దేశీయ పెట్టుబడులు సులభమైన నిష్క్రమణ మార్గాన్ని అందించాయని విశ్లేషించింది. కృత్రిమ మేధ ఆధారిత ట్రేడింగ్ తగ్గడం, హర్మూజ్ జలసంధిలో రాకపోకలు ప్రారంభమై, మార్కెట్ వాల్యుయేషన్లలో దిద్దుబాటు జరిగితే.. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ తగ్గొచ్చని నివేదిక పేర్కొంది. కరెంట్ ఖాతా లోటు (సీఏడీ) వల్ల రూపాయిపై ఒత్తిడి పడలేదని, అత్యల్ప మూలధన పెట్టుబడులే దీనికి ప్రధాన కారణమని స్పష్టం చేసింది. గత రెండేళ్లలో భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి ఏకంగా 7800 కోట్ల డాలర్ల (సుమారు రూ.7.49 లక్షల కోట్ల) మేర విదేశీ మూలధనం తరలిపోయిందని నివేదిక వెల్లడించింది.

మరో ఏడాదీ ఇదే పరిస్థితి?

భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) నివేదిక ప్రకారం 2026 మార్చిలో ఈక్విటీ పథకాల్లోకి రికార్డు స్థాయిలో రూ.38,503 కోట్లు, ఏప్రిల్‌లో రూ.38,410 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు 2024 అక్టోబరులో అత్యధికంగా రూ.37,840 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. సిప్‌ల ద్వారా మ్యూచువల్ ఫండ్లలోకి భారీగా నిధులు రావడం, ఈక్విటీ పెట్టుబడులకు ఉన్న పన్ను ప్రయోజనాలు, ఈపీఎఫ్ఓ, ఎన్‌పీఎస్ ద్వారా ఈక్విటీల్లోకి కేటాయింపులు పెరగడం వంటివి, విదేశీ అమ్మకాల ప్రభావాన్ని తట్టుకునేలా చేస్తున్నాయని నివేదిక వెల్లడించింది. ఈ పరిణామాల వల్ల గత రెండేళ్లుగా చెల్లింపుల స్థితి ప్రతికూలంగా ఉందని, రాబోయే ఏడాదీ ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనా వేసింది.

విలువ క్షీణిస్తున్నా..

2026 క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటి వరకు అమెరికా డాలరుతో పోలిస్తే భారత రూపాయి విలువ 7% క్షీణించి 96 స్థాయి వద్ద కదలాడుతోంది. వర్ధమాన దేశాల కరెన్సీలలో అత్యంత పేలవ పనితీరున్న వాటిలో రూపాయి ఒకటిగా నిలిచింది. అయినా, మార్కెట్లో ఆశలు సజీవంగానే ఉన్నాయి. గతంలో రూపాయి విలువ 12 నెలల వ్యవధిలో 10% కంటే ఎక్కువ క్షీణించిన 4 సందర్భాలను జెఫ్రీస్ విశ్లేషించగా, ఆ తర్వాతి 12 నెలల్లో మూడుసార్లు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) అనూహ్యంగా పుంజుకున్నట్లు గుర్తించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏఐ (కృత్రిమమేధ)లోకి వస్తున్న పెట్టుబడులు నెమ్మదిస్తే, ఈసారీ భారత మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని వివరించింది. చరిత్రను పరిశీలిస్తే రూపాయి బలహీనమైనప్పుడు భారత ఎగుమతులు పెద్దగా పెరగలేదని నివేదిక పేర్కొంది.

ఈ గణాంకాలు చూస్తే

జెఫ్రీస్ అంచనాల ప్రకారం, 2024 ఏప్రిల్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు నికరంగా 4400 కోట్ల డాలర్ల (సుమారు రూ.4.22 లక్షల కోట్ల) విలువైన భారతీయ షేర్లను విక్రయించారు. దీంతో 202526 ఆర్థిక సంవత్సరంలో క్యాపిటల్ అకౌంట్ మిగులు ఎన్నడూ లేని విధంగా 0.5 శాతానికి పడిపోయింది (గత పదేళ్లలో ఇది సగటున 2.6 శాతంగా ఉండేది). గత మూడేళ్లలో (202426) భారత కరెంట్ అకౌంట్ లోటు జీడీపీలో 0.8% (రికార్డు స్థాయిలో అత్యల్పం) మాత్రమే నమోదైంది. 202627 ఆర్థిక సంవత్సరంలోనూ ఇది 2% కంటే తక్కువగానే ఉంటుందని పేర్కొంది. జూన్ నుంచి ముడిచమురు ధర బ్యారెల్‌కు సగటున 90 డాలర్ల వద్ద ఉండొచ్చని, బంగారం దిగుమతులు 10% తగ్గుతాయన్న అంచనాలతో ఈ నివేదిక రూపొందించినట్లు జెఫ్రీస్ వెల్లడించింది.

ఏఐకి సిద్ధం కాకపోవడం అంటే.. మహమ్మారిని విస్మరించినట్లే: ఆంథ్రోపిక్ కోఫౌండర్

శరవేగంగా విస్తరిస్తోన్న కృత్రిమ మేధ విషయంలో అప్రమత్తంగా లేకపోతే.. భవిష్యత్తులో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికన్ కంపెనీ ఆంథ్రోపిక్ (Anthropic) సహ వ్యవస్థాపకుడు జాక్ క్లార్క్ హెచ్చరించారు. ఏఐ పురోగతిని ఇంకా చాలామంది అర్థం చేసుకోలేకపోతున్నారన్నారు. ఏఐకి సిద్ధం కాకపోవడం అంటే.. కొవిడ్ 19 వంటి మహమ్మారిని ఎదుర్కోవడానికి సన్నద్ధంగా లేకపోవడం వంటిదే అవుతుందని చెప్పారు. మనుషులను మించిన సామర్థ్యం ఉండే ఈ సాంకేతికత నుంచి ముప్పు ఎదుర్కోక తప్పదని హెచ్చరికలు చేశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆయన ఇచ్చిన ఉపన్యాసం తాజాగా వైరల్ అవుతోంది. ''మానవ మనుగడకు దీనితో ఉన్న ముప్పు తొలగిపోలేదు. మనం చూస్తూ ఉండిపోయి, కృత్రిమ మేధ తన సామర్థ్యాలను పెంచుకోవడానికి మనం అనుమతిస్తూ ఉంటే.. చివరకు మనం ప్రతిస్పందించాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ సాంకేతిక అభివృద్ధిని కాస్త నెమ్మదింపజేయగలితేనే.. మానవాళికి మంచిది. అయితే ఈ టెక్నాలజీ విషయంలో ఒకరిమీద మరొకరు/ఒక దేశంపై మరో దేశం పైచేయి సాధించేందుకు తీవ్రంగా పోటీ పడుతున్నందున ఆ ఆలోచన అసాధ్యమే అవుతోంది'' అని క్లార్క్ (Jack Clark) విద్యార్థులతో మాట్లాడారు. అంతకుముందు ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ (Dario Amodei) ఇదేవిధంగా స్పందించారు. 'ది అడాల్‌సెన్స్ ఆఫ్ టెక్నాలజీ' పేరుతో రాసిన సుదీర్ఘ వ్యాసంలో ఏఐ భవిష్యత్తు, పొంచి ఉన్న ముప్పు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డారియో సమగ్ర విశ్లేషణ చేశారు. మనం ఇప్పుడు అత్యంత శక్తిమంతమైన సాంకేతికతను చేజిక్కించుకునే దశలో ఉన్నామని, ఇది మానవజాతికి ఒక అగ్నిపరీక్ష వంటిదని, మన సామాజిక, రాజకీయ వ్యవస్థలకు ఈ శక్తిని నిర్వహించే పరిపక్వత ఉందో, లేదో తెలియని సందిగ్ధత నెలకొందని ఆయన వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.



మళ్లీ పుంజుకున్న మార్కెట్లు

డాలర్ @ రూ.95.60

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.4,440 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.6,004 కోట్లు

ఒక రోజు విరామం తర్వాత సూచీలు పుంజుకున్నాయి. బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు మద్దతుగా నిలిచాయి. అమెరికాఇరాన్ శాంతి చర్చల పురోగతిపై ఆశలు పనిచేశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 76 పైసలు బలపడి 95.60 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 2.3% పెరిగి 104.7 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.72,000 కోట్లు పెరిగి రూ.462.83 లక్షల కోట్ల (4.82 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77 పాయింట్ల (క్రితం ముగింపు 75,183.36) లాభంతో 75,260.39 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 75,810.97 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 231.99 పాయింట్ల లాభంతో 75,415.35 వద్ద ముగిసింది. నిఫ్టీ 64.60 పాయింట్లు పెరిగి 23,719.30 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,671 23,835.65 పాయింట్ల మధ్య కదలాడింది. ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాలు ప్రకటించడంతో ఎల్ఐసీ షేరు ఇంట్రాడేలో రూ.839 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 1.58% లాభంతో రూ.813.35 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 షేర్లలో 14 రాణించాయి. ట్రెంట్ 3.01%, యాక్సిస్ బ్యాంక్ 2.52%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.77%, ఏషియన్ పెయింట్స్ 1.56%, హెచ్‌యూఎల్ 1.06%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.97% లాభపడ్డాయి. సన్‌ఫార్మా 2.43%, ఐటీసీ 2.03%, పవర్‌గ్రిడ్ 1.75%, బీఈఎల్ 0.99%, భారతీ ఎయిర్‌టెల్ 0.73% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. ప్రైవేట్ బ్యాంకులు 1.35%, టెలికాం 0.93%, ఆర్థిక సేవలు 0.90% పెరిగాయి. హాస్పిటల్స్ 1.39%, ఆరోగ్య సంరక్షణ 1.23%, ఐటీ 0.32% తగ్గాయి. రంగాల వారీ సూచీల్లో.. ఐటీ, ఫోకస్డ్ ఐటీ, యుటిలిటీస్, ఎఫ్ఎమ్‌సీజీ, బ్యాంకింగ్ 0.53% వరకు పడ్డాయి. బీఎస్ఈలో 2168 షేర్లు లాభపడగా, 2027 స్క్రిప్‌లు నష్టపోయాయి. 174 షేర్లలో ఎటువంటి మార్పులేదు. మార్చిలో స్పాట్ కరెన్సీ మార్కెట్‌లో నికరంగా 9.758 బిలియన్ డాలర్లను విక్రయించినట్లు ఆర్‌బీఐ నెలవారీ బులెటిన్‌లో వెల్లడించింది. అంతకు ముందు ఫిబ్రవరిలో 7.409 బి.డాలర్లను కొనుగోలు చేసింది. ఇటీవల సమీకరించిన రూ.4000 కోట్లలో రూ.3500 కోట్లను రుణ వ్యాపార వృద్ధి వినియోగించనున్నట్లు ఆదిత్య బిర్లా క్యాపిటల్ ప్రకటించింది. మిగిలిన రూ.500 కోట్లను కార్పొరేట్ అవసరాలు, అనుబంధ సంస్థల పెట్టుబడులను వినియోగించనుంది.

తగ్గిన ఫారెక్స్ నిల్వలు....

మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు మే 15తో ముగిసిన వారానికి 8.094 బి.డాలర్లు (దాదాపు రూ.77,000 కోట్లు) తగ్గి 688.894 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.65.44 లక్షల కోట్ల)కు పరిమితం అయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 6.295 బి.డాలర్లు పెరిగి 696.988 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 6.483 బి.డాలర్లు క్షీణించి 545.904 బి.డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 1.536 బి.డాలర్లు తగ్గి 119.317 బి.డాలర్లకు పరిమితమయ్యాయి.

సన్‌ఫార్మా లాభం రూ.2714 కోట్లు

సన్ ఫార్మాస్యూటికల్స్, మార్చి త్రైమాసికంలో రూ.2714.03 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 202425 ఇదే కాల లాభం రూ.2,149.88 కోట్ల కంటే ఇది 26.2% అధికం. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.12,958.84 కోట్ల నుంచి రూ.14,611.79 కోట్లకు పెరిగింది. ఫార్ములేషన్ల వ్యాపారంలో వృద్ధి పటిష్ఠంగా ఉండటం వల్లే మంచి ఫలితాలు సాధించామని పేర్కొంది. వ్యయాలు కూడా రూ.9,955.68 కోట్ల నుంచి రూ.11,518.95 కోట్లకు పెరిగాయి. నీ 202526 పూర్తి ఆర్థిక సంవత్సరానికి సంస్థ నికరలాభం రూ.11,479.42 కోట్లుగా ఉంది. 202425 లాభం రూ.10.929.04 కోట్లే. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.52,578.44 కోట్ల నుంచి రూ.58,462.04 కోట్లకు పెరిగింది. నీ 2025 26 ఆర్థిక సంవత్సరానికి రూ.5 తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ బోర్డు ప్రతిపాదించింది. ఇప్పటికే మధ్యంతర డివిడెండుగా రూ.11 చెల్లించిన సంగతి విదితమే.

ఎస్‌బీఐ సిబ్బంది సమ్మె వాయిదా

ఈ నెల 25 (సోమ), 26 (మంగళవారం) తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఉద్యోగులు, తదుపరి ఆ ప్రతిపాదనను వాయిదా వేసుకున్నారు. బ్యాంక్ యాజమాన్యంతో శుక్రవారం చర్చలు సానుకూలంగా జరగడం ఇందుకు నేపథ్యమని ఆలిండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ తెలిపింది.

స్ఫూర్తి రగిలించేలా 'పెద్ది' పోరాటం: రామ్‌చరణ్

'పెద్ది' తన మనసుకు ఎంతో దగ్గరైన చిత్రమన్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఇది తన ఫిల్మ్ లైబ్రరీలో నంబర్ వన్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రామ్‌చరణ్ టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మించారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూన్ 4న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి భోపాల్‌లో 'పెద్ది కీ ఆవాజ్' పేరుతో ప్రచార వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్ట్ ఆహుతుల్ని ఉర్రూతలూగించింది. దీనిలో భాగంగా చరణ్ కోరిక మేరకు ఇంకా విడుదల కాని ఈ చిత్ర థీమ్ గీతాన్ని రెహమాన్ లైవ్‌లో వినిపించారు. అనంతరం రామ్‌చరణ్ మాట్లాడుతూ.. "ఇది కేవలం క్రీడా నేపథ్య చిత్రమే కాదు.. తన గుర్తింపు కోసం పోరాడే ఓ వ్యక్తి కథ. ఆ పోరాటం కచ్చితంగా అందరి మనసుల్ని దోచుకుంటుంది. ప్రతిఒక్కర్నీ ఆలోచింపజేస్తుంది.. స్ఫూర్తిని రగిలిస్తుంది. ఈ సినిమాని మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా చేస్తుంది. దీన్ని కచ్చితంగా మీ పిల్లలతో కలిసి చూడండి. వాళ్లలో స్ఫూర్తిని నింపుతుంది" అన్నారు.ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రులు విశ్వాస్ సారంగ్, రాకేశ్ శుక్లా, ఎంపీ రవికిషన్, సినీతారలు జాన్వీ కపూర్, దివ్యేందు శర్మ, నిర్మాత సతీశ్ కిలారు తదితరులు పాల్గొన్నారు.

"అవన్నీ ఫేక్... బాధ్యులపై చర్యలు

ఏఐ సహాయంతో అసభ్యకర రీతిలో తన ఫొటోలను సృష్టించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రముఖ కథానాయిక రుక్మిణీ వసంత్. వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించి ఇలాంటి ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానిస్తూ ఎక్స్ వేదికగా ఓ నోట్‌ని విడుదల చేశారు. "ఏఐ ఉపయోగించి సృష్టించిన నా ఫొటోలను ఆన్‌లైన్‌లో వైరల్ చేయడాన్ని నేను, నా టీమ్ గమనించాము. అవన్నీ ఫేక్. ఏఐతో చేసినవి అని స్పష్టం చేయదలుచుకున్నా. ఇలాంటి ఫొటోలు, కంటెంట్‌ని సృష్టించి ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యం. ఈ వ్యవహారాన్ని మేము తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఫొటోలు క్రియేట్ చేసిన వారితో పాటు, ఆన్‌లైన్ వేదికగా వైరల్ చేస్తున్న వారిపైనా న్యాయపరంగా, సైబర్ క్రైమ్ ద్వారా చర్యలు ప్రారంభించాం. ఇలాంటి కంటెంట్, ఫొటోలను ఆన్‌లైన్‌లో పంచుకోవడం మానుకోవాలని ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా" అని అందులో పేర్కొన్నారు. రుక్మిణి స్విమ్మింగ్ పూల్ వద్ద ఫొటోషూట్ చేయించుకుంటున్నట్లు ఉన్న కొన్ని ఫొటోలు, వీడియోలు వైరలవడంతో దీనిపై రుక్మిణీ తాజాగా స్పందిస్తూ ఫేక్ అని స్పష్టం చేశారు. సినిమా, పబ్లిక్ ఈవెంట్స్‌కు హాజరయ్యే నటీమణులను అభ్యంతరకర రీతిలో జూమ్ చేసి ఫొటోలు తీయడంపై రుక్మిణి ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న 'డ్రాగన్'

మే 23.. ఎప్పటికీ ప్రత్యేకమే!

తన జీవితంలో మే 23వ తేదీ ఎప్పటికీ ప్రత్యేకమేనని కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ సంవత్సరం మరింత ప్రత్యేకమని తెలిపారు. ఆయన తొలి సినిమా 'విక్రమ్' విడుదలై శనివారంతో 40ఏళ్లు అయిన నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. "మే 23.. నేనెప్పటికి మర్చిపోలేను. మా నాన్న చివరి సినిమా 'మనం' 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌తో నటించే అవకాశం ఆ చిత్రంతోనే దక్కింది. ఇక 40ఏళ్ల క్రితం ఇదే రోజు నా తొలి సినిమా 'విక్రమ్' విడుదలైంది. అందర్నీ అలరించడం కోసం.. అందరి ప్రేమాభిమానాల్ని పొందడం కోసం నేనిక్కడికి వచ్చా. 'విక్రమ్' నాకెంతో మంది అభిమానుల్ని దగ్గర చేసింది. ఇన్నేళ్లు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలాగే వేడుక చేసుకోవాలని కోరుకుంటున్నా" అని నాగ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన రా.కార్తీక్ దర్శకత్వంలో 'కింగ్ 100'లో నటిస్తున్నారు.

ఆ సన్నివేశాలు చేసేటప్పుడు ఇబ్బంది పడ్డాం!

"ఇన్నేళ్లు నేను పడిన కష్టంతో పోలిస్తే.. 'అగ్లీ స్టోరీ' చిత్రంతో నటుడిగా చాలా బాగా పేరొచ్చింది" అన్నారు హీరో నందు. ఆయన.. అవికా గోర్ జంటగా నటించిన ఈ సినిమాని ప్రణవ స్వరూప్ తెరకెక్కించారు. సుభాషిని, కొండా లక్ష్మణ్ నిర్మించారు. శివాజీ రాజా, రవితేజ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో థాంక్‌స్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో నందు మాట్లాడుతూ.. "ఈ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. ఇందులోని కొన్ని సన్నివేశాలు చేసేటప్పుడు మేమూ ఇబ్బంది పడ్డాం. కానీ, సినిమా కోసమే తప్పక చేశాం. ఈ చిత్రంతో నటుడిగా నాకు మంచి పేరొస్తుందని ముందే అనుకున్నా. ప్రస్తుతం అమ్మాయిలు గతంతో పోలిస్తే బలంగా ఉంటున్నారు. భర్త క్రూరంగా ఉంటే భార్యకు అతడ్ని భరించాల్సిన అవసరం లేదు. ఇకపై నా రానున్న చిత్రాలు కుటుంబ సమేతంగా చూడగలిగేలా ఉంటాయి" అన్నారు. 'ప్రేమ అనేది మారుతుంటుంది. కానీ, కొన్ని సందర్భాల్లో కొంతమంది తప్పక అలా ఉండిపోతారు. అదే ఈ చిత్రంతో చెప్పాలనుకున్నా" అన్నారు దర్శకుడు ప్రణవ స్వరూప్.

ఇక్కడ ప్రీత్.. అక్కడ బానీ!

ఇలాంటి పెళ్లిని ఇంతకు ముందెన్నడూ కనివిని ఎరుగరు అంటూ తాను ఇష్టపడిన బానీ అనే అమ్మాయిని అంగరంగ వైభవంగా పెళ్లి చేసుకుంటాడు జస్. కానీ, పరిస్థితుల ప్రభావం వల్ల ఈ జంట మధ్య దూరం పెరుగుతుంది. ఈ క్రమంలో ప్రీత్ అనే అమ్మాయితో ప్రేమలో పడతాడు జస్. వీరి పయనం సరదాగా సాగిపోతున్న తరుణంలో తాను గర్భవతినంటూ జస్ జీవితంలోకి మళ్లీ తన భార్య వచ్చేస్తుంది. ఓ వైపు భార్య మరోవైపు ప్రేయసి... ఇద్దరూ ప్రెగ్నెంట్‌లు అవ్వడంతో ఇరకాటంలో పడిన జస్ కథ చివరికి ఏమైందో తెలియాలంటే 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రం చూడాల్సిందే. ఈ సినిమాలో ఇద్దరు బిడ్డలకు తండ్రి కాబోతున్న జస్ పాత్రలో బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ కనిపించనున్నాడు. కథానాయికలు మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే.. బానీ, ప్రీత్‌లుగా అలరించనున్నారు. డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రమేశ్ తౌరనీ నిర్మించారు. ఈ సినిమా జూన్ 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను పంచుకుంది. 'ప్రీత్ ఇక్కడ.. బానీ అక్కడ ఇప్పుడు మనం ఏం చేయాలి' లాంటి సంభాషణలు, నవ్వులు పూయించే సన్నివేశాలతో ఆకట్టుకుంటుందీ ట్రైలర్. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో మౌనీరాయ్, మనీష్ పాల్, చుంకీ పాండే తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

తప్పిపోయి రాలేదు.. వెతుక్కుంటూ వచ్చిన!



'ఈ లెనిన్ గాడు నిప్పు'' అంటున్నారు కథానాయకుడు అక్కినేని అఖిల్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ 'లెనిన్' చిత్రాన్ని మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. శివాజీ కీలక పాత్ర పోషించారు. నాగార్జున చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టి శనివారానికి 40ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ''మనోడు వస్తున్నాడు'' అంటూ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. ఇది చిత్తూరు నేపథ్యంగా సాగే యాక్షన్ ప్రేమకథతో ముస్తాబైంది. కానీ, టీజర్ ప్రధానంగా నాయకానాయికల ప్రేమకథ చుట్టూనే తిరిగింది. భాగ్యశ్రీ స్టేజ్ ఆర్టిస్ట్‌లా పౌరాణికం గెటప్పులో 'దాన వీర శూర కర్ణ' డైలాగ్ చెప్పడం.. హీరో ఆమె వెంట పడటం.. ఆ తర్వాత వాళ్లిద్దరూ కలిసి చేసిన ప్రయాణాన్ని ఈ ప్రచార చిత్రంలో ఆసక్తికరంగా చూపించారు. ఆఖర్లో ''నేను తప్పిపోయి రాలేదు మచ్చా.. మీ అందర్నీ వెతుక్కుంటూ వచ్చిన'' అనే డైలాగ్‌తో అఖిల్‌ని యాక్షన్ కోణంలో చూపించిన తీరు ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమా జూన్ 26న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: లియోన్ బ్రిట్టో.

హెడ్‌కు కోహ్లి చేయి ఇవ్వలేదని..



హైదరాబాద్: ఆటతో పాటు.. మాటల్లోనూ దూకుడు ప్రదర్శించే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ప్రవర్తించిన తీరు వార్తల్లో నిలిచింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్ మాటలతో కవ్వించేందుకు ప్రయత్నించగా మైదానంలో కోహ్లి మాటలతో బదులిచ్చాడు. అయితే మ్యాచ్ ముగిసిన అనంతరం ఆటగాళ్లు పరస్పరం కరచాలనం చేసుకునే సమయంలో సన్‌రైజర్స్ ఆటగాళ్లందరితో కరచాలనం చేసిన కోహ్లి.. హెడ్‌తో చేతులు కలపకపోవడం చర్చనీయాంశమైంది. కోహ్లి క్రీజులో ఉన్నప్పుడు హెడ్ ''షాట్లు ఆడు అంటూ'' అతణ్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. విరాట్ వెంటనే ''నువ్వే వచ్చి బౌలింగ్ చేయి'' అంటూ ఘాటుగా స్పందించాడు. వెంకటేశ్ అయ్యర్ బౌండరీ బాదిన సమయంలోనూ కోహ్లి.. హెడ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశాడు. ఈ మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ 55 పరుగుల తేడాతో ఆర్సీబీపై గెలిచింది.

'లక్ష్య' అనూషకు కాంస్యం

హైదరాబాద్, విజయవాడ క్రీడలు, : జాతీయ సీనియర్ ఫెడరేషన్ పోటీల్లో 'ఈనాడు' సీఎస్ఆర్ కార్యక్రమం లక్ష్య అథ్లెట్ మల్లాల అనూష సత్తాచాటింది. శనివారం ఆమె ట్రిపుల్ జంప్‌లో 13.28 మీటర్లు దూకి కాంస్యం సాధించింది. విజయవాడకు చెందిన భవానీ యాదవ్ లాంగ్ జంప్‌లో 6.39 మీటర్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సొంతం చేసుకుంది. కేరళకు చెందిన ఆన్సీ సోజన్ (6.75మీ.) పసిడి, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శైలి సింగ్ (6.58మీ) రజత పతకం కైవసం చేసుకున్నారు. వంద మీటర్ల విభాగంలో గుర్వింందర్‌వీర్ సింగ్ జాతీయ రికార్డు సాధించాడు. అనిమేశ్ పేరిట ఉన్న (10.15 సెకన్లు) రికార్డును గుర్వింందర్‌వీర్ బద్దలుకొట్టాడు. అతడు 10.09 సెకన్లలోనే రేసు పూర్తి చేసి విజేతగా నిలిచాడు. అనిమేశ్ (10.20), ప్రణవ్ (10.29) రెండు, మూడో స్థానాల్లో నిలిచారు. 400 మీటర్లలో టీకే విశాల్ 44.98 సెకన్లలోనే పరుగెత్తి.. ఆసియాలోనే రెండో వేగవంతమైన అథ్లెట్‌గా నిలిచాడు. రాజేశ్ రమేశ్ (45.31), జైకుమార్ (45.47) తర్వాతి స్థానాల్లో నిలిచారు. అత్యుత్తమ ప్రదర్శన చేసిన గుర్వింందర్‌వీర్, విశాల్ కామన్వెల్త్ క్రీడలకు అర్హత సాధించారు.

సినర్ పట్టేస్తాడా!

నేటి నుంచే ఫ్రెంచ్ ఓపెన్
బరిలో జకోవిచ్, సబలెంకా, స్వైటెక్
మ॥ 2.30 నుంచి

పారిస్: పిన్న వయసులో అన్ని గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్స్ చేరిన ఆటగాడిగా నిలిచాడు.. ఇప్పటికే వింబుల్డన్, ఆస్ట్రేలియన్ ఓపెన్, యుఎస్ ఓపెన్ గెలిచాడు.. ఫ్రెంచ్ ఓపెన్ మాత్రం అతడికి ఇంకా అందలేదు.. నిరుడు ఫైనల్ చేరినా అల్కరాస్ (స్పెయిన్) అడ్డుపడ్డాడు. ఈసారి గాయం కారణంగా అతడు బరిలో లేడు. మరి ఇటలీ స్టార్ ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినర్ టైటిల్ అందుకుంటాడా? కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తిచేస్తాడా. అతడికి సీనియర్ ఆటగాడు నొవాక్ జకోవిచ్ నుంచి గట్టిపోటీ తప్పదు. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ఉన్న జకోవిచ్ ఈసారి ఎలాగైనా ఫ్రెంచ్ ఓపెన్ వదలొద్దని పట్టుదలగా ఉన్నాడు. ఆదివారమే ఈ టోర్నీకి తెరలేవనుంది. టాప్‌సీడ్ సినర్ సింగిల్స్ తొలి రౌండ్లో టాబర్ (ఫ్రాన్స్)తో తలపడనున్నాడు. మూడో సీడ్ నొవాక్.. తొలి రౌండ్లో పెరికార్డ్ (ఫ్రాన్స్)తో పోటీపడనున్నాడు. రెండో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ).. బోంజి (ఫ్రాన్స్)తో, ఆరో సీడ్ మెద్వెదెవ్ (రష్యా).. వాల్టన్ (ఆస్ట్రేలియా)తో తలపడతారు.

అమ్మాయిల్లో గట్టిపోటీ: మహిళల సింగిల్స్‌లో ఈసారి గట్టిపోటీనే జరిగేలా కనిపిస్తోంది. ప్రపంచ నంబర్‌వన్ అర్యానా సబలెంకా (బెలారస్) ఫేవరెట్‌గా బరిలో దిగనుంది. కానీ డిఫెండింగ్ ఛాంపియన్ కొకో గాఫ్ (అమెరికా), క్లే కోర్టుల్లో చెలరేగే ఇగా స్వైటెక్ నుంచి ఆమెకు పెను సవాల్ ఎదురు కానుంది. టాప్ సీడ్ సబలెంకా, నాలుగో సీడ్ గాఫ్ ఒకే పార్శ్వంలో ఉన్నారు. వీళ్లిద్దరూ సెమీస్‌లో ఎదురుపడే ఛాన్స్ ఉంది. తొలి రౌండ్లో బౌజస్ (స్పెయిన్)తో సబలెంకా.. టౌన్‌సెండ్ (అమెరికా)తో గాఫ్ పోటీని ప్రారంభించనున్నారు. నాలుగుసార్లు ఛాంపియన్, మూడో సీడ్ స్వైటెక్ మొదటి రౌండ్లో ఎమర్సన్ జోన్స్ (ఆస్ట్రేలియా)తో ఆడుతుంది. సెమీఫైనల్ వరకు స్వైటెక్‌కు సవాల్ ఎదురు కాకపోవచ్చు. వెరోనికా (స్లొవేనియా)తో రెండో సీడ్ రిబకినా (కజకిస్థాన్), బిరెల్ (ఆస్ట్రేలియా)తో అయిదో సీడ్ పెగులా (అమెరికా) తలపడనున్నారు.

భారత్ నుంచి..: భారత్ నుంచి ఈసారి సింగిల్స్‌లో జూనియర్ విభాగంలో మాత్రమే పోటీ ఉంది. బాలికల్లో మాయ రాజేశ్వరన్, బాలురలో అర్జున్ పపార్కర్ బరిలో ఉన్నారు. సీనియర్ విభాగంలో పురుషుల డబుల్స్‌లో యుకి బాంబ్రి, శ్రీరామ్ బాలాజీ ఆడుతున్నారు. మైకేల్ వీనస్ (న్యూజిలాండ్)తో యుకి.. మార్సెలొ డెమోలినర్ (బ్రెజిల్)తో బాలాజీ జతగా పోటీపడనున్నారు.

పంజాబ్ రేసులోనే..

లఖ్‌నవూపై కీలక విజయం శ్రేయస్ మెరుపు సెంచరీ రాణించిన ప్రభ్‌సిమ్రన్ లఖ్‌నవూ

ఐపీఎల్-19లో ఆరంభంలో ఆరు విజయాలు సాధించి ప్లేఆఫ్స్ చేరే తొలి జట్టు ఇదేనా అనిపించిన పంజాబ్ కింగ్స్ తర్వాత వరుసగా ఆరు మ్యాచ్‌లు ఓడి ఆ అవకాశాలను క్లిష్టం చేసుకుంది. రేసులో ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఆ జట్టు అదరగొట్టింది. శ్రేయస్ మెరుపు సెంచరీకి తోడు ప్రభ్‌సిమ్రన్ రాణించడంతో పరాజయాల పరంపరకు చెక్ పెడుతూ కీలక విజయాన్ని అందుకుంది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను ఓడించిన పంజాబ్.. ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఇక ఆ జట్టు ప్లేఆఫ్స్ చేరుతుందా లేదా అన్నది ఆదివారం జరిగే మ్యాచ్‌లపై ఆధారపడివుంది.

పంజాబ్ నిలిచింది. ఓటమి బాటను వీడి అత్యావశ్యక విజయం సాధించింది. శ్రేయస్ అయ్యర్ (101 నాటౌట్; 51 బంతుల్లో 11×4, 5×6) అజేయ సెంచరీతో చెలరేగిన వేళ ఆ జట్టు 7 వికెట్ల తేడాతో లఖ్‌నవూను ఓడించింది. మొదట లఖ్‌నవూ 6 వికెట్లకు 196 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లిస్ (72; 44 బంతుల్లో 9×4, 2×6) టాప్ స్కోరర్. ఆయుష్ బదోని (43; 18 బంతుల్లో 5×4, 3×6), సమద్ (37 నాటౌట్; 20 బంతుల్లో 3×4, 3×6) కూడా రాణించారు. చాహల్ (2/25), యాన్సెన్ (2/33) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఛేదనలో శ్రేయస్ శతకానికి, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (69; 39 బంతుల్లో 7×4, 2×6) దూకుడు తోడవడంతో పంజాబ్ 18 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

శ్రేయస్, ప్రభ్‌సిమ్రన్ జోరు: ఛేదనలో పంజాబ్ కూడా ఆరంభంలో లఖ్‌నవూ ఇన్నింగ్స్‌నే తలపించింది. షమి పదునైన బంతులతో విజృంభించడంతో పంజాబ్ 22 పరుగులకే 2 వికెట్లు చేజార్చుకుంది. ఇన్నింగ్స్ తొలి బంతికే ఫామ్‌లో ఉన్న ప్రియాంశ్ (0) ను ఔట్ చేసిన షమి.. తర్వాత కనోలీ (18) వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఈ స్థితిలో ప్రభ్‌సిమ్రన్, కెప్టెన్ శ్రేయస్ పంజాబ్‌ను ఆదుకున్నారు. వీళ్లిద్దరూ కుదురుకుని ధాటిగా ఆడడంతో పంజాబ్ స్కోరు పరుగులెత్తింది. అర్జున్ తెందుల్కర్ వేసిన ఎనిమిదో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ 6, 4.. శ్రేయస్ ఓ ఫోర్ కొట్టడంతో 9 ఓవర్లకు పంజాబ్ 94/2తో నిలిచింది. 28 బంతుల్లో ప్రభ్‌సిమ్రన్, 33 బంతుల్లో శ్రేయస్ అర్ధసెంచరీలు అందుకున్నారు. ఈ జంట అదే జోరు కొనసాగించడంతో సమీకరణం (42 బంతుల్లో 58) అందుబాటులోకి వచ్చేసింది. పంజాబ్ లక్ష్యం దిశగా దూసుకెళ్తున్న స్థితిలో అర్జున్ ఓ చక్కని యార్కర్ లెంగ్త్ బంతితో ప్రభ్‌సిమ్రన్‌ను ఎల్బీగా ఔట్ చేశాడు. కానీ శ్రేయస్ నాటకీయతకు అవకాశం ఇవ్వలేదు. షమి వేసిన 16వ ఓవర్లో మూడు సిక్స్‌లు బాది పంజాబ్‌ను లక్ష్యానికి చేరువ చేశాడు. మోసిన్‌ఖాన్ వేసిన 18వ ఓవర్ చివరి బంతికి శ్రేయస్ సిక్స్‌తో జట్టును గెలిపించడమే కాక.. 51 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. ఐపీఎల్ కెరీర్‌లో అతడికి ఇదే తొలి శతకం.

నిలిచిన ఇంగ్లిస్: అంతకుముందు లఖ్‌నవూ ఆరంభంలో తడబడినా.. తర్వాత పుంజుకుని 200కు చేరువగా స్కోరు చేయగలిగింది. ఓపెనర్ ఇంగ్లిసే ఇందుకు కారణం. ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన అతడు.. జట్టు భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లో ఇంగ్లిస్ నాలుగు ఫోర్లు కొట్టి మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. కానీ తర్వాత ఎల్ఎస్‌జీ రెండు ఓవర్ల వ్యవధిలో అర్షిన్ (0), పూరన్ (2) వికెట్లు చేజార్చుకుంది. అర్షిన్‌ను ఒమర్‌జాయ్ ఔట్ చేస్తే.. పూరన్‌ను యాన్సెన్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఈ స్థితిలో బదోని దూకుడుగా ఆడాడు. అతడు ఫోర్లు, సిక్స్‌ల వేటలో సాగడంతో 3 ఓవర్లకు 20/2తో ఉన్న లఖ్‌నవూ.. పవర్‌ప్లే ఆఖరికి 66/2తో బలంగా పుంజుకుంది. జోరు మీదున్న బదోనిని చాహల్ బుట్టలో వేసినా.. ఇంగ్లిస్ దూకుడు కొనసాగించాడు. ధాటిగా షాట్లు ఆడి 28 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. కెప్టెన్ రిషబ్ పంత్ (26) నుంచి అతడికి మంచి సహకారం అందింది. సెంచరీ చేసేలా కనిపించిన ఇంగ్లిస్ ఔట్ కావడంతో స్కోరు నెమ్మదించింది. 18, 19 ఓవర్లలో 10 పరుగులే వచ్చాయి. కానీ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో సమద్ ధాటిగా ఆడి స్కోరు 200కు సమీపంగా తీసుకెళ్లాడు.

రాజస్థాన్ చేతిలో..

పంజాబ్, కోల్‌కతా ఆశలన్నీ ముంబయిపైనే. ఆదివారం రాజస్థాన్‌ను ముంబయి ఓడిస్తే ఆ రెండు జట్లు రేసులోకి వస్తాయి. లేదంటే 16 పాయింట్లతో రాజస్థాన్ రాయల్స్ ముందంజ వేస్తుంది. ఒకవేళ రాజస్థాన్ ఓడితే పంజాబ్‌కు మెరుగైన అవకాశం ఉంటుంది. ఇప్పటికే 15 పాయింట్లతో పాటు మెరుగైన రన్‌రేట్ కలిగివున్న ఆ జట్టును అధిగమించి ప్లేఆఫ్స్ చేరాలంటే.. కోల్‌కతా భారీ తేడాతో దిల్లీని ఓడించాలి. ఏదేమైనా లీగ్ దశలో ఆఖరి రోజు రసవత్తరంగా ముగియడం ఖాయం.

అర్జున్ తెందుల్కర్ తొలిసారి..

సచిన్ తెందుల్కర్ తనయుడు అర్జున్ ఎట్టకేలకు ఎల్ఎస్‌జీ తరఫున తొలి మ్యాచ్ ఆడాడు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో అవకాశం దక్కించుకున్న అతడు బ్యాటింగ్‌లో ఎనిమిదో స్థానంలో వచ్చి 5 బంతుల్లో అజేయంగా 5 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో పర్వాలేదనిపించాడు. 4 ఓవర్లు వేసి 36 పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. అర్జున్ ఫీల్డింగ్‌లో ఓ క్యాచ్ కూడా అందుకున్నాడు. 2023, 24లో అర్జున్ ముంబయి ఇండియన్స్‌కు ఆడాడు.

లఖ్‌నవూ ఇన్నింగ్స్: ఇంగ్లిస్ (సి) శ్రేయస్ (బి) శశాంక్ 72; అర్షిన్ కులకర్ణి (సి) ప్రభ్‌సిమ్రన్ (బి) అజ్మతుల్లా 0; పూరన్ (బి) యాన్సెన్ 2; బదోని (స్టంప్డ్) ప్రభ్‌సిమ్రన్ (బి) చాహల్ 43; పంత్ (సి) యాన్సెన్ (బి) చాహల్ 26; సమద్ నాటౌట్ 37; ముకుల్ (సి) ప్రవీణ్ దూబె (బి) యాన్సెన్ 1; అర్జున్ తెందుల్కర్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 196; వికెట్ల పతనం: 116, 220, 369, 4134, 5169, 6172; బౌలింగ్: అర్ష్‌దీప్ 3052 0; అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 30291; యాన్సెన్ 40 332; చాహల్ 40252; విజయ్‌కుమార్ 3-0-26 -0; శశాంక్ 3-0-29-1

పంజాబ్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ (సి) అర్జున్ (బి) షమి 0; ప్రభ్‌సిమ్రన్ ఎల్బీ (బి) అర్జున్ 69; కనోలీ (బి) షమి 18; శ్రేయస్ నాటౌట్ 101; షెడ్జే నాటౌట్ 9; ఎక్స్‌ట్రాలు 3, మొత్తం: (18 ఓవర్లలో 3 వికెట్లకు) 200; వికెట్ల పతనం: 10, 222, 3162; బౌలింగ్: షమి 40452; ప్రిన్స్ 30320; మోసిన్ 4-0-48-0; దిగ్వేశ్ 3-0-39-0; అర్జున్ 4-0-36-1

టీజీ20 జట్లొచ్చేశాయ్

ఉషోదయదే హైదరాబాద్
టీజీ20 ఫ్రాంఛైజీ రామోజీ గ్రూపు సొంతం
రూ.7.50 కోట్లతో అత్యధిక బిడ్

తెలంగాణ క్రికెట్లో నవ శకానికి నాంది. ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకురావడం.. గ్రామీణ ప్రాంతాల క్రికెటర్ల సత్తాకు వేదికగా నిలవడమే లక్ష్యంగా ఆరంభంకానున్న తెలంగాణ టీ20 క్రికెట్ లీగ్ (టీజీ20)లో ఎనిమిది ఫ్రాంఛైజీలు ఖరారయ్యాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జరగనున్న ఈ లీగ్‌లో 'ఈనాడు' అడుగుపెట్టింది. శనివారం నిర్వహించిన టీజీ20 బిడ్డింగ్‌లో ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (రామోజీ గ్రూపు) అత్యధిక ధరకు హైదరాబాద్ ఫ్రాంఛైజీని దక్కించుకుంది. మొత్తం ఎనిమిది జట్ల కోసం 13 సంస్థలు రేసులో నిలవగా.. రూ.7,50,01,000 ధరతో 'ఈనాడు' అగ్రస్థానంలో నిలిచింది. బిడ్డింగ్‌లో అత్యధిక ధర వేసిన సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో జట్లను ఎంచుకునే అవకాశం కల్పించగా.. హైదరాబాద్ ఫ్రాంఛైజీని ఈనాడు సొంతం చేసుకుంది. ఉషోదయ ఎంటర్ ప్రైజెస్ డైరెక్టర్ జి.సాంబశివరావు బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొని హైదరాబాద్ ఫ్రాంఛైజీని ఎంపిక చేసుకున్నారు. హైకోర్టు ఏకసభ్య కమిటీ హెడ్ జస్టిస్ నవీన్‌రావు, హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్‌నాథ్, కార్యదర్శి మన్నె జీవన్‌రెడ్డి.. టీజీ20 ఛైర్మన్ ఆగమ్‌రావు, లీగ్ ఆపరేషన్స్ హెడ్ భరణి సమక్షంలో ఫ్రాంఛైజీ ఒప్పందంపై సాంబశివరావు సంతకాలు చేశారు. ''టీజీ20లో అవకాశం లభించినందుకు గర్వంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల క్రికెటర్లను ప్రోత్సహించేందుకు 2006లో ఈనాడు ఛాంపియన్ కప్ క్రికెట్‌ను ప్రారంభించాం. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా 2010లో లిమ్కా బుక్ రికార్డ్స్, 2013లో గిన్నిస్ బుక్ రికార్డ్‌స్‌లో ఈనాడు క్రికెట్ కప్ చోటు దక్కించుకుంది. యువ ఆటగాళ్లను ప్రోత్సహించడానికి టీజీ20 సువర్ణావకాశంగా భావిస్తున్నాం'' అని సాంబశివరావు తెలిపారు. రూ.7,20,00,000 ధరతో రెండో స్థానంలో నిలిచిన బూరుగు ఇన్‌ఫ్రా/ప్రణవ సంస్థ రంగారెడ్డి జట్టును సొంతం చేసుకుంది.

జూన్ 7న వేలం: టీజీ20 ఫ్రాంఛైజీల కోసం సుమారు 50 సంస్థలు ఆసక్తి కనబరిచాయి. శనివారం బిడ్ల దాఖలుకు చివరి రోజు కాగా.. 13 సంస్థలు రేసులో నిలిచి.. ఎనిమిది జట్లను దక్కించుకున్నాయి. జూన్ 7న నిర్వహించే వేలంలో ఫ్రాంఛైజీలు ఆటగాళ్లను ఎంపిక చేసుకుంటాయి. తెలంగాణ క్రికెటర్లు తిలక్‌వర్మ, మహ్మద్ సిరాజ్ కూడా ఈ వేలంలో భాగమయ్యే అవకాశముంది. హైదరాబాద్ జట్లకు వివిధ వయోపరిమితి విభాగాల్లో ఆడిన ఆటగాళ్లు, లీగ్ క్రికెటర్లు, ఓపెన్ సెలెక్షన్‌స్‌లో ఎంపికైన ఆటగాళ్లతో వేలం జాబితా రూపొందిస్తారు. ఆటగాళ్లు తమ కనీస ధరను రూ. 50 వేలు నుంచి రూ.5 లక్షలు వరకు నమోదు చేసుకోవచ్చు. ఆటగాళ్ల కొనుగోలు కోసం ఒక్కో ఫ్రాంఛైజీకి రూ.60 లక్షల పరిమితి ఉంటుంది. ఉప్పల్‌లో జరిగే ఈ లీగ్ జూన్ 20న ఆరంభమవుతుంది. జులై 11న ఫైనల్ నిర్వహిస్తారు. మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్ తెలుగులో ప్రత్యక్ష ప్రసారమవుతాయి. జియో హాట్‌స్టార్ యాప్‌లో కూడా మ్యాచ్‌లు వీక్షించొచ్చు. తమిళనాడు ప్రిమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్) మాజీ సీఈఓ ప్రసన్న కన్నన్ టీజీ20 లీగ్‌కు ఎగ్జిక్యూటివ్ హెడ్‌గా నియమితుడయ్యాడు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఆయా క్రికెట్ సంఘాలు ఇప్పటికే టీ20 లీగ్‌లను నిర్వహిస్తున్నాయి.

"తెలంగాణ క్రికెట్లో ఇదో చరిత్రాత్మక క్షణం; హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్‌రెడ్డి

''తెలంగాణ క్రికెట్లో ఇదో చరిత్రాత్మక క్షణం. టీజీ20 కేవలం ఒక లీగ్ మాత్రమే కాదు. యావత్ తెలంగాణలో ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి.. అవకాశాలను కల్పించడానికి.. ఆట స్థాయిని పెంచడానికి రూపొందించిన దీర్ఘకాలిక క్రికెట్ పర్యావరణ వ్యవస్థకు పునాది''

వినేశ్‌కు గ్రీన్‌సిగ్నల్

ట్రయల్స్‌లో పాల్గొనేందుకు దిల్లీ హైకోర్టు అనుమతి

దిల్లీ: సీనియర్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఆసియా క్రీడల సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు దిల్లీ హైకోర్టు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వినేశ్‌లాంటి పేరున్న అథ్లెట్‌ను పోటీలకు దూరంగా ఉంచాలనుకోవడాన్ని దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం తప్పుపట్టింది. ఆమెలాంటి మహిళా అథ్లెట్లను మాతృత్వం కారణంగా పోటీలకు మినహాయించకూడదని తెలిపింది. ఈ నెల 30, 31న జరగనున్న ఆసియా గేమ్స్ ఎంపిక పోటీల దృశ్యాల్ని రికార్డ్ చేయాలనీ కోర్టు ఆదేశించింది. ఈ ప్రక్రియకు భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్) నుంచి, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నుంచి చెరొక పరిశీలకుడు హాజరు కావాలని చెప్పింది. ఆసియా క్రీడల ట్రయల్స్ నిబంధనలను డబ్ల్యూఎఫ్ఐ ఆఖరి నిమిషంలో సవరించడంపై వినేశ్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే.